# కార్యేషు భర్త!?

మా వాళ్ళకు నేనొక్కడినే మగపిల్లవాడిని! నా తర్వాత ముగ్గురు చెల్లెళ్ళు! వంశాకురాన్ని కదా... ఒక్కగానొక్క మగబిడ్డ... రేపు తలకొరివి పెట్టాల్సిన వాడిని కదానో... పున్నామ నరకం నుండి తప్పిస్తాననో నన్ను స్పెషల్‌గా ఏం చూడలేదు సరికదా ఇంట్లో చాకిరీ అంతా నా నెత్తినే! ఇంటా బైట పన్లన్నీ నాకే అంటగట్టటం!

డాడీకి కేంపులమీద వెళ్ళే ఉద్యోగం! నెలకి ఇరవై రోజులు ఇంట్లో వుండడు. మిగతా పదిరోజులూ ఇల్లు పట్టదు. పెత్తనమంతా అమ్మదే! ముగ్గురు చెల్లెళ్లను అయిన దానికి కాని దానికీ వెనకేసుకొస్తుంది.

అమ్మ గారాబం చూచుకుని చెల్లెళ్ళు ముగ్గురు పెంకిఘటాల్లా తయారయ్యారు. వాళ్ళకంటే నేను పెద్దవాడిని అన్నయ్యననే గౌరవంలేదు. నన్ను పేరుపెట్టి పిలుస్తారు. ఒరే తురే అంటూంటే నాకు వళ్ళుమండుతుంది.

ఆ దేవుడు తనను మగాడిగ ఎందుకు పుట్టించాడు!- తన్నూ ఆడపిల్లగా పుట్టించి ఉంటే ఎన్ని సుఖాలో!? గౌన్లు... పావడాలు... రకరకాల మోడ్రన్ డ్రెస్‌లు చెవులకు మెళ్ళో బంగారు నగలు. వీధిలో వాళ్ళతో ఏకమై తొక్కుడుబిళ్ళ... చెమ్మచెక్క... ఉప్పులకుప్ప... అచ్చనగిల్లాలు ఆడుకునే అవకాశం వుండేది.

ఈ మగ పుటకలో అన్నీ ఇబ్బందులు... కష్టాలే! మగబతుక్కి మల్లెపూల జడలేసుకోను వీలుండదు... వాలుచూపులు విసిరి మురిపించటమనేదేలేదు.

ఇంట్లో అన్ని పన్లూ చచ్చినట్టు నేనొక్కడినే చెయ్యాలి! గాడిద చాకిరీ నావంతు! మమ్మీ మార్కెట్‌కెళ్ళి కూరలు తెమ్మంటుంది. సూపర్‌బజార్లో సరుకులు తెమ్మంటుంది. ఒకటా రెండా? ఎన్నని చెప్పుకోను?

ఆడపుటకలోనే బోలెడంత బ్యూటీ వుంది! ఆకర్షణుంది. అదృష్టం ఉంది. ఇంకా చాలా బోలెడున్నయ్.

అలాంటివన్నీ మగవెధవలకెక్కడివీ?!- చప్రాసీ పన్లన్నీ మగాడే చేయాలాయె!!

కొన్ని పన్లు చెల్లెళ్ళకి చెప్పచ్చుగా అని మమ్మీని నిలదీస్తే... నువ్వు చేసే పన్లులాంటివి చేయను వాళ్ళ వల్లేమౌతుంది? అయినా... పెళ్ళిళ్ళు అయ్యేదాకా ఆడపిల్లలు పుట్టింట్లో సుఖపడాలిరా!... అత్తారింటికి వెళ్ళేక కష్టాలు ఎలాగూ తప్పవ్... అంటూ చెల్లెళ్లను

వెనకేసుకురావటం నాకు అస్సలు నచ్చదు గాక నచ్చదు!

ఆడాళ్ళు ఈరోజుల్లో మగాళ్ళతో సమానమంటారు. హక్కులకోసం పోరాడతారు. లేడీస్ సీట్లో ఎప్పుడైనా మగాడు కూర్చుంటే సిటీ బస్టాప్ ఎగిరిపోయేట్టు కేకలు పెడబొబ్బలు పెడతారు... వాళ్ళకంటూ ప్రత్యేకమైన కేటాయింపులెందుకో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థమై చావదు.

ఆడాళ్ళకు సపరేట్ హైస్కూల్స్... కాలేజెస్సు! అది చాలదన్నట్టు కో-ఎడ్యుకేషన్ పేరిట మగాళ్ళ స్కూళ్ళలో కాలేజీల్లో బస్‌సీట్లలో కేటాయింపులు ఎగబడటాలు!

ఐలైకిట్! అందుకే వచ్చే జన్మలోనైనా ఆడపిల్లగా పుడితే మగరాస్కెల్స్‌ని చుట్టూ తిప్పుకుని ఏడిపించి ఎర్రమన్ను చేయచ్చు! మొగుడు సన్నాసిని నానాతిప్పలూ పెట్టి కూడు పెట్టకుండా లంఖణాలుంచచ్చు. అలకపాన్పెక్కి భర్తని కాలితో తన్ని మృదువుగా 'సారీ' చెప్పేయచ్చు. అసలు ఆడస్టైలే వేరు! ఆ మజా మగాళ్ళ లైఫ్‌లో వుండేడవదు.బిలీవ్ మీ! దిసీజ్‌ట్రూ!

మగాడి బతుకు ఎప్పుడూ చీవాట్లు చెప్పు దెబ్బలన్నట్టుంటుంది! ఇంటా బైటా ఇదే తీరు!

ఆఫీసులో బాసుగాడి చెలాయింపు. ఇంట్లో పెళ్ళాం పెత్తనం! అన్నివిధాలా నలిగిపోయేది మగసన్నాసే!

మగాడిపట్ల దయ సానుభూతి కన్నవారికి కట్టుకున్నదానికి... ఎవరికీ వుండకపోవటం శాపం!

అడ్డమైన పన్లు చేయటానికీ మగాడే కావాలి! రాత్రనక పగలనక గాడిద చాకిరీ చేయక తప్పదు.

అందుకే ఈ మగ జన్మంటే నాకు అసహ్యం... కాదు ఏవగింపు!

స్కూలుకెళ్ళిరావటం తప్పించి మా సిస్టర్స్ ఏనాడు చీపురు పట్టుకుని ఇల్లు వూడ్చిన పాపాన పోలేదు.

మమ్మీ దూరంగా ఉన్న మూడురోజులూ వంటపని సైతం నానెత్తినే! అదేమంటే చెల్లెళ్ళకేం చేతనౌను. అత్తారింటికెళ్ళాక ఎలాగూ నేర్చుకుని కష్టపడక తప్పదు... అంటూ మమ్మీ సపోర్టొకటి!

ఆమాటలు వింటున్నప్పుడు వంటికి కారం పూసినట్టు... కిరోసిన్ పోసి అంటించు కున్నట్టు వళ్ళంతా కోపంతో భగభగమండిపోతుంది.

మా ఇంటి పక్క వాటాలో వుండే అంకుల్‌ని చూస్తే జాలేస్తుంది. ఆ ఇంట్లో అందరికంటే ముందు ఆయనే నిద్రలేచి స్టౌ వెలిగించి కాఫీ పెడతాడు. పిల్లలకు స్వయంగ తానే స్నానాలు చేయిస్తాడు. యూనిఫారం వేస్తాడు. టిఫిన్ బాక్సులు సర్దుతాడు. వాళ్ళ బేగ్స్ తానే భుజాన తగిలించుకుని స్కూల్లో దిగబెట్టి వస్తాడు. రెండుపూటలా వంటే కాదు ఇంటెడి చాకిరీ గంగిరెద్దులా చేస్తాడు. మనిషి బహుమెతక! నోరులేని పెద్దమనిషి!

తెల్లారింది మొదలు రాత్రి పడుకునేవరకు గొడ్డులా ఎంత చాకిరీ చేసినా ఆ పెళ్ళాం మహాతల్లి అదే... అతగాడి వైఫ్ పెట్టే ఆరళ్ళు అంతా ఇంతా కాదు. చెండుకు తింటుంది.

కడుపునిండా తిననీయదు. కంటినిండా నిద్ర పోనీయదు.

అలాంటి మగపుటక పుడితేనేం? పుట్టకపోతేనేం అన్పిస్తుంది నా మటుక్కు నాకు!

సెల్‌ఫోనెప్పుడూ ఆంటీ చెవికి అతుక్కునే వుంటుంది. అయిన వారితో అక్కర్లేని వారితో గంటల తరబడి పోచికోలు కబుర్లు చెప్తూ సుత్తి కొడుతూ వుంటుంది.

ఇరవై నాలుగ్గంటలూ టి.వి. కే అంకితమౌతుంది. బోర్ కొట్టినప్పుడు ఎంచక్కా వీక్లీనో మంత్లీనో కాస్సేపు కాలక్షేపానికి చదువుతుంది.

నిజంగా ఆంటీని చూస్తుంటే ఆడదంటే ఆవిడలా ఉండాలి సుమా అన్పించక మానదు. ఆమె లెవెలే వేరు.

రేపు నా పెళ్ళాం కూడా అలాగే వుంటే... చచ్చానే! అలాంటి భార్య పగవాడిక్కూడా రాకూడదని దేవుళ్ళందరికీ దణ్ణాలు పెడుతూంటాను.

★★★★★

చదువు పూర్తయ్యేదాకా నాకు రోజూ ముప్పొద్దులా ఇంట్లో చద్ది అన్నమే! చెల్లెళ్ళకు మాత్రం వుడుకుడుకు అన్నం. అదేమంటే... ఆడపిల్లలు సుకుమారులురా! వాళ్ళు నాజూగ్గా వుండాలంటే వేడివేడిగ తినాల్రా... అని మమ్మీ అంటూంటే గుడ్లనీరు కుక్కుకోవటం తప్పించి నోరు పెగిలేదికాదు.

నా చదువు పూర్తికాగానే మంచి జాబొచ్చేసింది. హమ్మయ్య! నా కష్టాలు తీరాయి అనుకున్నాను. ఉత్సాహంతో నా మనసు ఎగిరి కోతిలా గంతులేసింది.

ఇంకేముంది?- చెల్లెళ్ళ చదువు పూర్తి కాలేదనే వంకతో... నన్నొక ఇంటివాడిని చేయటానికి పేరెంట్స్ డిసైడైనారు.

చూచిన ఒక్కగానొక్క అమ్మాయి నాకు భలేగ నచ్చేస్తుంది. శాలిని అందగత్తె! డిగ్రీ చదివింది. జాతకాలూ కుదరటంతో కట్నం పుచ్చుకోవటం ఇష్టంలేని మా డాడీ వెంటనే మేరేజ్ ఫిక్స్ చేసేశాడు.

అఫ్‌కోర్స్ నలుగురాడ పిల్లల తండ్రి కావటంతో పైసా కట్నం ఇవ్వలేనంటూ శాలిని వాళ్ళ ఫాదర్ తాంబూలాల నాడే కాళ్ళు బారజాపినా మేచ్ ఫిక్సింగ్ జరిగిపోయింది.

అంత అందమైన పిల్ల నా జీవితభాగస్వామి అవుతుందని కల్లో కూడా వూహించలేదు. పూతరేకులా... పసిడి బొమ్మల్లా... సంపెంగ పువ్వులా... చక్రాల్లాంటి కళ్ళు... లేలేత పెదవులు... నవ్వినప్పుడు సొట్టపడే బుగ్గలు... తీర్చిదిద్దిన కనుబొమలు... అసలు పెళ్ళిచూపులనాడే అమాంతం శాలినిని వాటేసుకుందామనుకున్నాను. దీని పని ఇప్పుడుకాదు... శోభనం నాడు చెప్తాను... అనుకుని సరిపెట్టుకున్నాను.

పెళ్ళి సిదాసాదాగా చేశాడు పిల్ల తండ్రి. అదీ... దేవుడి గుళ్ళో! ఓ ఫంక్షన్‌హాల్ లేదు... బ్యాండ్‌మేళం లేదు... అట్టహాసంలేదు. ఓ ముష్టోడి పెళ్ళి జరిగినట్టు తూ.తూ. మంత్రంగ పెళ్ళి అయిందన్పించుకున్న శాలిని డాడీని చూచి ఆయనగారి మీదపడి పీక పిసికి చంపాలన్నంత కోపం వచ్చింది. ఆయన ఆర్థిక స్థోమత అంతేకాబోలనేసి నా ఆవేశాన్ని బలవంతాన అణచుకోక తప్పలేదు.

తర్వాత శోభనం సీను!

ఇదెంత లక్షణంగ వుంటుందోని నాకు బెంగగానే వుంది.

రాత్రి తొమ్మిది గంటలకల్లా నన్ను గదిలోకి పొమ్మన్నారు.

అదిగదా?... చీకటి గుహలా వుంది. ఓ పందిరిమంచం లేదు... వాటిచుట్టూ మల్లెపూల దండల్లేవు...ఓ డన్లప్ బెడ్‌లేదు... అగరొత్తుల సువాసనలేదు... సెంటు పరిమళం లేదు... ఆ గదికి కనీసం ఒక కిటికీ అయినా లేదు. తలపైకెత్తిన నాకు దిక్కుమాలిన సీలింగ్‌ఫ్యాన్ కూడా అవుపించలేదు.

నా గుండె చెరువైంది. ఇదేం శోభనం గదిరా దేవుడోయ్ అంటూ నా మనసు మూగగా రోదించింది.

ఇంతలో మామగారొచ్చి... టేబుల్‌ఫ్యాన్ కోసం ట్రై చేశాను అల్లుడూ... మేరేజ్ సీజన్ కావటాన తెల్సిన వారినందరినీ అడిగి చూచినా ఫలితం లేకపోయింది. సారీ! ఎలాగో నువ్వే సర్దుకుపోవాలి... అన్చెప్పి తుర్రుమన్నాడు.

శోభనం గది అలంకరణ ఎలా వుంటుందో! ఎన్నో సినిమాల్లో చూశాను! టి.వీ. సీరియల్స్‌లో చూశాను. నాలో గల రంగురంగుల కలలన్నీ దుస్వప్నాలైనయ్.

ఎంచక్కా... హనీమూన్‌కి ఏ సింగపూరో వెళ్ళినా బాగుండేది!... అనేసి వాపోయాను.

ఇంతలో శాలిని గదిలోకి పాలగ్లాసు బదులు పెద్దసైజు కొవ్వొత్తి చేతిలో పట్టుకుని వచ్చింది.

'నువ్వేంటి? దెయ్యానివా? పెళ్ళి కూతురివా?' ఆశ్చర్యంలోంచి తెప్పరిల్లుకుని ప్రశ్నించాను.

'సారీ డియర్. నీవంటికి మిల్క్ పడవని... ఎలర్జీ అని మీ మమ్మీ చెప్తేనూ... తేలేదు. పైగా మా ఇంట్లో వెండిగ్లాసుల్లేవు. మేము వెరీ వెరీ పూర్!...' తడబడకుండా ధైర్యంగ అంది శాలిని.

'అంతా అబద్ధం! నాకు పాలు ఇష్టంలేదని ఎవరు చెప్పారు. రోజుకు రెండులీటర్ల పాలు ఉదయం సాయంత్రం తాగే అలవాటుంది- మీ పద్ధతేం బాగోలేదు... గో బేక్... వెళ్ళి ఎట్‌లీస్ట్ గాజుగ్లాసుతోనైనా చిక్కటి మిల్క్ పట్రా!... తినటానికి స్వీట్లు ఫ్రూట్లు ఇక్కడేంలేవ్- కనీసం పాలైనా తాగి తృప్తి పడతాను...' అరిచినట్టే మాట్లాడాను.

శాలిని వెనుదిరిగింది!

ఛ! నవ వధువుని అనవసరంగ కోపగించుకున్నాను. నాది తప్పే! లెంపలేసుకున్నాను.

★ ★ ★ ★ ★

పదహారు రోజుల పండక్కి అత్తారు ఆహ్వానిస్తే... అదెంత లక్షణంగ వుంటుందో అనుకుంటూనే వెళ్ళాను.

ఇంట్లో కనీసం టి.వీ. అయినా లేదు కాలక్షేపానికి. న్యూస్‌పేపరైనా తెప్పించుకోని మామగారిని చూచి వళ్ళుమండింది. శాలిని చూద్దామా అంటే... వాళ్ల సిస్టర్స్‌తో ఇరవై నాలుగు గంటలూ ముచ్చట్లు. నాకు అత్తవారింట్లో ఒక్కరోజు కూడా వుండబుద్ధికాలేదు. ఆఫీసులో అర్జంట్ వర్క్ వుందనే నెపంతో అత్తగారింటినుండి బైటపడి బతుకుజీవుడానుకున్నాను.

పోనీ... శాలినిని కాపురానికి పంపించమని మామగారిని అడుగుదామా అంటే... మా ఇంట్లోనూ సుఖం వుండదు. అత్త ఆడబిడ్డలు కలిసి దాన్ని సుఖపడనీయరు. నాకు మనశ్శాంతి లేకుండా చేస్తారనిపించటంతో సైలెంట్‌గ వుండిపోయాను.

నా లక్ బావుండి ప్రమోషన్ మీద నన్ను వైజాగ్ ట్రాన్స్‌ఫర్ చేయటంతో... కొత్త కాపురానికి శ్రీకారం చుట్టబోతున్నందుకు నా మనసు ఎగిరి గంతేసింది. ఎవరి పొక్కు పోరూ ఉండదు. ఎంచక్కా నేను శాలినీ ఇద్దరం హేపీగ రోజులు గడిపేయచ్చు అన్పించింది.

ఇంకేముంది కార్డు ముక్క రాసిందే తడవుగా మామగారొచ్చి శాలినిని దిగవిడిచి వెళ్ళారు.

హమ్మయ్య! అందరి పీడ వదిలిందనుకున్నాను. శాలినికి ఇల్లు... వాతావరణం నచ్చింది! ఎ.సి. బెడ్‌రూమ్... కలర్ ఫ్లాట్ బిగ్ టి.వి... బాత్‌రూమ్‌లో షవరు... గీజరు... ఇంట్లో ఫోను... చూచి మురిసి మెలికలు తిరిగిపోయింది శాలిని!

కొత్తింట్లో శాలినిని పాలు పొంగించమన్నాను. అమ్మో! గ్యాస్ స్టౌ అంటే తనకు భయమంది. వంట చేయటం తనకు రాదన్నది. ఇలా ఒక్కోటి చెప్తూపోతుంటే నాకు భయమేసింది. అప్పట్లో మా డాడీ వాళ్ళింట్లో పక్కవాటాలో వుండే అంకుల్ గుర్తుకొచ్చాడు.

ఆ అంకుల్ కష్టాలు తనకూ తప్పవు కాబోలనేసి నా మనసు బాధతో మూలిగింది.

శాలినిని ఏడిపించాలనే వుద్దేశంతో 'నీకేం చేతనవును?-' అనడిగాను.

'వెటకారాలు నాకు నచ్చవ్! నువ్వు వంట చేస్తే... నేను డైనింగ్ టేబుల్ మీద వుంచి కంచాల్లో వడ్డిస్తాను...' అంది శాలిని.

'పోనీ కలిపి ముద్దలు చేసుకుని మింగటమైనా వచ్చా? అదీ రాదా?'-

'ఆపండి అధిక ప్రసంగం!'

నా గుండె గతుక్కుమంది. నోరు పడిపోయింది. అమ్మో... ఇది ఘటికురాలే... నోరు పెట్టుకు గెలిచే రకంలా వుంది అన్పించింది.

'పోనీ... పిల్లలనైనా కంటావా?-'

'బహువచనానికి చోటులేదు. ఓన్లీ వన్ చైల్డ్. నో ప్లూరల్! కని మీ చేతుల్లో పెడతాను. బిడ్డ ఆలనా పాలనా భారం మీదే!'

'అంటే...' నివ్వెరపోయాను.

'వేళకి బాటిల్ ఫీడింగ్ ఇవ్వాలి మీరే! కాళ్ళమీద పడుకోబెట్టుకుని బిడ్డ వంటికి నూనె పట్టించి నలుగుపెట్టి... స్నానం చేయించాలి!... క్రేడిల్లో పడుకోబెట్టి నిద్రపుచ్చాలి!...'

'అంతేనా! ఇంకా ఏమైనా నా డ్యూటీ ఇంట్లో వుందా?-'

'ఇంటిపన్లు... వంటపన్లు... బిడ్డ పన్లు... (పుడితే)... బైటపన్లూ అన్నీ మీరే చేయాలి! పనిమనిషిని నమ్మలేం. అందుకని బాసిన్లు తోమాలి! వాషింగ్‌మెషీన్లో వేసి బట్టలు

శుభ్రం చేయాలి! ఇల్లు ఊడవాలి! వారానికో మారు ఇల్లంతా బూజు దులపాలి!..' ఇంకా చెప్తూనే వుంది.

ఓరినాయనో... దీన్తో వేగటం కష్టమే! అన్పించింది. సుఖపడనియ్యదు కాబోలు.

మహాతల్లీ! నువ్వింతటి ప్రతిభాశాలివా? తెలీక నీ మెళ్ళో తాళి కట్టి నీ నెత్తిన తలంబ్రాలు పోశాను!

'నువ్వేపనీ చేయకుండా వళ్ళు పెంచుకుంటే... ఊబకాయమొస్తుంది. బి.పి. వస్తుంది. బాడీలో కొలస్ట్రాల్ పెరుగుతుంది. చివరికి హార్ట్ఎటాక్ కూడా రావచ్చు! తర్వాత నీ ఇష్టం!...' అనేశాను.

వాక్యం పూర్తికాకుండానే నా చెంప ఛెళ్ళుమన్పించింది శాలిని! బిత్తరపోయాను. నోటమాట రాలేదు.

'బీ కేర్‌ఫుల్! భార్యంటే ఎగతాళా? మీరు నాకు తాళి కట్టారు. నేనేం చెప్తే అది చేయాలి! టెక్కేర్...' అపరకాళిలా గుడ్లురిమి భయపెట్టింది.

హుం! ఖర్మ ఖర్మ! ఎరక్కపోయి ఈ రాక్షసిని చేసుకోవటం ఏ జన్మలోనో నే చేసుకున్న మహాపాపంగ తోచింది.

ఇలాంటి పెళ్ళానికి నావంటివాడు 'కార్యేషు భర్తే' మరి! ఈ జన్మకు నాకీ శిక్ష చాలు!!

- సమాప్తం -